# శిశిరంలో... వసంతం!

రెండేళ్లల్లోకి రిటైర్మెంట్ గెంతుకొచ్చింది. బాధ్యతలన్నీ సర్వీసులో వుండగానే తీరిపోయినయ్. ఇద్దరు అల్లుళ్లు ఫారిన్లో సెటిలైనారు. ఒక కొడుకు పోలీసు ఎస్సై! రెండో వాడికి పెద్దగా చదువు అబ్బనందున ఓ ప్రైవేటు కంపెనీలో తక్కువ జీతానికి వుద్యోగానికి కుదిరాడు.

రిటైరయ్యాక బాదరబందీలేమీ వుండవ్. కానీ సొంత ఇల్లు ఏర్పరచుకోవాలనే కోరిక తీరకుండా రిటైరై పోతున్నందుకు నాకంటే నా శ్రీమతికి ఎక్కువ బాధగా వుంది.

'మనం ముసలివారం అవుతున్నాం! మనకంటూ ఓ సొంత ఇల్లు అవసరం! ఏంతిన్నామని ఎవ్వరూ మనలను ప్రశ్నించరండీ... అదీగాక అద్దెకొంప అయితే చచ్చాకపీనుగను ఒక్క క్షణం కూడా ఇంటి ముందు వుంచటానికి ఓనర్లు వప్పుకోరు!...' శ్రీమతి క్లాస్ పీకింది.

'అందుకని?-'

'అలా ప్రశ్నలు వేసుకుంటూ పోతె ఈ జన్మకు మనం ఇల్లు ఏర్పరుచుకోలేం! నా మాటవిని రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో చిన్నదైనా సరే ఇల్లు కొనుక్కుందాం! ఏమంటారు?'

'ఆపవే నీ పిచ్చివాగుడు!. నాది పెన్షన్ లేని వుద్యోగమని తెలిసీ ఇట్లా మాట్లాడతావేం? ఆ వచ్చే డబ్బు కాస్త ఇంటికి పెడితే... ఆతర్వాత మనసంగతేంటి? ఇల్లు కొంటే చేతులో డబ్బులేక కొడుకుల్ని యాచించాల్సి వస్తుంది! అది నాకు నచ్చదు!- చేతికొచ్చే డబ్బు దాచుకుంటే ఆవచ్చే నెలవడ్డీతో మనిద్దరం హాయిగా.. దర్జాగా బతికేయొచ్చు... అర్థమైందా?-' కాస్త వివరంగా శ్రీమతితో చెప్పాను.

'అవేం మాటలండీ? కొడుకులు ఆమాత్రం మనల్ని ఆదుకోరా?...'

'కోరే! కోరు! కోడళ్లిద్దరికీ మనమంటే అభిమానం ప్రేమ లేదనే విషయం మనకు తెలుసు! తెలిసి మళ్లీ అట్లా మాట్లాడుతావేం! కొడుకులిద్దరూ భార్యా విధేయులే! పెద్దోడు పోలీసు ఎస్సై అన్నమాటే గానీ.. వూళ్లోనే వుంటున్నా.. కనీసం ఏడాదికోమారైనా వచ్చి మనలను చూచి వెల్తున్నాడా? లేదే... రెండోవాడు సరేసరి...

కోడలు ఒక్కతే కూతురు కావటాన అత్త వారి తదనంతరం ఆస్తి అంతా తనకే దక్కాలని వారికి అణకువగా వుంటూ మనలను నిర్లక్ష్యం చేస్తున్నాడు. ఎన్ని సార్లు పిలిచినా కనీసం ఒక్కపండక్కైనా మనింటికొచ్చి నాలుగు మెతుకులు తిని వెళ్లాడా?- అన్నీ తెలిసీ ఇంకా అయోమయంలోనే నువ్వు వున్నావ్!- ఇల్లు కావాలని కలలు కనద్దు! అద్దె ఇంట్లో అయినా సరే ఆనందంగా వుందాం....' నా చివరి నిర్ణయం చెప్పేశాను.

స్వంత ఇల్లు లేదని కొన్నాళ్లు బాధపడినా తర్వాత ఎడ్జెస్టైంది. వచ్చిన పాతిక లక్షల మొత్తాన్ని ఎఫ్.డి లో వేసి వచ్చే వడ్డీతో కాలం గడిపేస్తున్నాం. కొడుకులున్నారనే విషయాన్ని సైతం స్ఫురణకు రానంత హేపీగ రిటైర్డ్ లైఫ్ గడిచి పోతోంది.

సంతోషంతో... సుఖంతో... ఆనందంతో రెండేళ్లు గడిచినయ్-

ఒకరోజు తెల్లవారుజామున బాత్‌రూమ్ కెళ్లొస్తానని నేను మంచి నిద్రలో వుండగ చెప్పిన వరూధిని పావుగంట... అరగంట... దాటినా తిరిగొచ్చి పక్క మీద పడుకోకపోవటం మగత నిద్రలో వున్న నేను గమనించి లేచి కూర్చొని రెండు సార్లు బిగ్గరగా పిలిచాను. రెస్పాన్స్ రాకపోవటంతో కంగారుపడుతూ బాత్‌రూమ్ వేపు నడిచాను.

బాత్‌రూమ్ తలుపు బార్లగ తెరిచే వుంది. నేలమీద పడివున్న వరూధినిని చూచి అవాక్కయ్యాను.

'వరూ!... ఏమైందినీకు..?' దగ్గరై ఊపిరి ఆడుతున్నదోలేదని ముక్కు దగ్గర వేలుపెట్టాను. చెయ్యి తీసుకుని పల్స్ చూశాను. నా గుండె ఒక్క క్షణం స్పందన కోల్పో నట్టు అన్పించింది.

'నన్ను ఒంటిరి వాడిని చేసి నీ దోవ నీవు వెళ్లి పోయావా వరూ...' దాన్ని బైటికి తీసుకొస్తూ ఘోల్లుమన్నాను.

వరూధిని అంత్యక్రియలకు కొడుకులిద్దరూ వచ్చి అన్నీ యధావిధిగా జరిపించారు నా డబ్బుతో! నా భార్య చావుకి డబ్బు ఖర్చుపెట్టవలసిన వచ్చినందుకు... కొడుకులిద్దరున్నా వారుపైసా కూడా ఖర్చు చెయ్యటానికి ముందుకు రాకపోయినా బాధపడ్లేదు.

కూతుళ్లు దూరాన వుండటాన కర్మకాండకు రాలేకపోయారు.

వరూధిని పోయాక వుంటున్న ఇల్లు ఖాళీ చేయాల్సి వచ్చింది. కొడుకులకు

స్వంత ఇళ్లు వున్నా... 'నాన్నా మాతో రండి.. మా దగ్గరకొచ్చి వుండండి' అని ఆప్యాయంగా పిలవనందుకు బాధన్పించలేదు.

వారి దోవన చేతులు దులుపుకుని వాళ్లు పన్నెండోరోజునే వెళ్లిపోయారు.

వరూధిని నన్ను ఒంటరివాడిని చేసినందుకే నాప్రాణం విలవిల్లాడి పోయింది.

× × × × ×

నేను ఏకాకినైపోయాను. నన్ను పలుకరించే వారు... ఆదరించే వారూ కరువైనారు. మనశ్శాంతి లేకుండా పోయింది.

ఇంట్లో బోలెడు ఇత్తడి... స్టీలు... ఇనుప... కొయ్యసామానుంది... నా ఒక్కడి కోసం అంత సామాను అక్కర్లేదన్పించి కొడుకులిద్దరినీ వారికి కావలసినవి వచ్చి తీసుకెళ్లమన్నారు. వారికి తన వద్ద వున్నా పాత సామాను అక్కర్లేదని ఫోన్లోనే చెప్పేశారు.

అవును మరి! కొడుకులు సంపాదన పరులు... అస్థిపరులాయె... ఇక ఎప్పుడో అవసరానికి కొని వుంచి ఇన్నేళ్లుగా వాడుకుంటున్న వస్తువులతో వారికేం పని? అవి వారికి ఎందుకు నచ్చుతయ్... అన్పించి అనవసర మన్పించినవన్నీ అమ్మి డబ్బు చేసుకున్నాను.

మరో ఇల్లు అద్దెకు తీసుకుని వక్కడినే వుండటం దుర్భరమన్పించింది! కొడుకులు తనను వచ్చి తమతో వుండమని అడగనే లేదు. హుఁ! కన్న బిడ్డలకు తన పట్ల ఎంత విరోధ భావం? ఇది వారికి పుట్టిన బుద్ధి కాదని తెల్సు నాకు. అందుకే వాళ్లతో తగేవు ఎందుకులే అన్పించి వూరుకున్నాను.

హోటల్ తిండి నా వంటికి సరిపడదు. స్వయంపాకం ఎన్నేళ్లని? రేపు వయస్సు డిగి లేవలేని పరిస్థితి ఎదురైతే భవిష్యత్ ఎలా వుంటుందో వూహించుకుని భయపడ్డాను.

ఏమైనా భార్యాభర్త లిరువురూ బ్రతికి వుంటేనే సుఖం... తృప్తి... ఆనందం! ఇరువురిలో ఏ వక్కరుపోయినా రెండవ లైఫ్ పాట్నర్‌కు అశాంతి అసంతృప్తి... వేదన... రోదనే!-

ఏదైనా మంచి ఓల్డేజ్‌హోంలో వుండమని నాఫ్రెండ్స్ సూచించారు. అదీ కరక్టేనన్పించింది.

సిటీకి దూరంగా ఆశ్రమంలా నిర్మింపబడిన ఓల్డేజ్ హోం చాలా బాగుంటుందని తెల్సి నేరుగా నాకున్న కొద్దిపాటి లగేజి తీసుకుని అక్కడికి వెళ్లాను. వెళ్లి వాకబు చేయగా సింగిల్ రూమ్స్ వేకెంట్‌గా వున్నాయని తెల్సి సంతోషించాను. మేనేజర్‌తో నా రిక్వైర్‌మెంట్స్ వివరించాను.

ఆశ్రమం సెక్రటరీ మరో అర్ధగంటలో వస్తారనీ వెయిట్ చేయమని చెప్పాడు మేనేజర్.

'సెక్రెటరీ గారే ఈ ఆశ్రమం ఓనరాండీ?' మేనేజర్‌ని అడిగారు.

'అవునండీ... సెక్రెటరీ గారు మంచి సంపన్నులు సిటీలో వుంటారు. ఉదయం సాయంత్రం కారులో వచ్చి ఓరెండు మూడుగంటలుండి వెడతారు. ఈ ఆశ్రమం ఆమె గారు సొంతగా ఏర్పాటు చేసినదే... ఆమె బాగా చదువుకున్న మహిళ!...' మేనేజర్ చెప్తూ ఎదురుగా వస్తున్న కారు చూచి చెప్పటం ఆపాడు.

ఆమె కార్లోంచి ఠీవిగా దిగింది! మేనేజర్ ఎదురెళ్లాడు. వయస్సును కప్పేసిన అలంకరణ ఆమెలో కన్పించింది. నుదుట పెద్ద బొట్టు... మెడనిండా నగలు... బాబ్డ్ హెయిర్... స్లీవ్ లెస్ జాకెట్టు... బంగారు రంగు ఫ్రేమున్న కళ్లద్దాలు... హై హీల్ షూతో మనిషి నిండుగ గంభీరంగ వుంది.

రాగానే ఆమె తన ఆఫీసు రూమ్‌లోకి వెళ్లింది. మేనేజర్ తిరిగొచ్చి 'మేడమ్ మిమ్మల్ని పిలుస్తున్నారు' అని చెప్పి తన ఆఫీసు గది వైపు నడిచాడు.

లగేజ్ అక్కడే వుంచి 'సెక్రటరీ రూమ్ వద్ద కెళ్లి లిప్తపాటు గుమ్మం వద్దే నిలబడ్డాను.'

కమిన్ ప్లీజ్ అనే మధురమైన కంఠస్వరం విని లోనికి ప్రవేశించి 'నమస్తే మేడమ్...' అంటూ దగ్గరకెళ్లి ఎదురు కుర్చీలో కూర్చోమని ఆమెకళ్లతోటే సైగ చేయటంతో కూర్చుండి పోయాను.

ఒకరినొకరం ఎగాదిగా చూసుకున్నాం!

'మీరు...' ఆమె అనబోగా

'మీరు...' అని నేనూ అని ఆగాను.

'నన్ను మట్లాడనీయండి ముందు మీ పేరు... పేరూ... ఆఁ! గుర్తొచ్చింది హరనాథ్ కదా?...' అందామె.

'నా వూహే నిజమైతే... మీరు... సౌమిత్రి.... అవునా?-' గతాన్ని ఆకళింపు చేసుకుంటూ అన్నాను.

'నన్ను 'మీరు' అనద్దు హరనాథ్...'

'అవును!... నిజం! సౌమిత్రి వయసు మీదపడినా... వెనకటి ఆప్యాయత ఆమె పలకరింపులో తొంగిచూడటం ఆశ్యర్యమన్పించింది.

'హరనాథ్! మనం కల్సుకని యాభైయేళ్లు దాటింది- నువ్వు నన్ను చదువుకునే రోజుల్లో ఆరాధించే వాడివి?... నన్ను ప్రేమిస్తున్నావనికూడా అన్నావ్ కదూ? గుర్తుందా?...'

తెలియని సిగ్గు నాలో జొరబడింది!

'మనిద్దరికీ రాసిపెట్టలేదా దేవుడు. అందుకే ఒకటి కాలేకపోయాం. ఎవరిదారి వారిదైంది. అవునూ మీ హజ్బెండు... పిల్లలు... ఎలా వున్నారు?-' కుశలమడిగాను.

'శ్రీవారితో కాపురం ఒక కలలామిగిలింది. ఆయన సడన్‌గా పోయారు. మాకు పిల్లల్లేరు.. వారి యావదాస్తికి నేను వారసురాలినైనాను- నాకు మళ్లీ పెళ్లి మీద కోరిక కలగలేదు- ఆ సమయంలో నువ్వు కన్పించి వుండివుంటే నిన్ను సెకండ్ మ్యారేజ్ చేసుకుని వుండేదాన్ని...' కిలకిలా నవ్వింది.

ఆమెను ప్రేమించే రోజుల్లో ఆమె నవ్వుకే దాసుడినైపోయేవాడిని. ఆ నవ్వు కోసం పడిచచ్చేవాడిని.

'ఏమిటి ఆలోచిస్తున్నావ్?- మరి నీ గురించి చెప్పు!... నువ్వు ఓల్డేజ్ హోంకి రావటమేమిటి? ఆశ్యర్యంగానూ... స్టన్నింగ్‌గానూ వుంది...' రివాల్వింగ్ ఛైర్లో అటు ఇటు వూగుతూ మాట్లాడింది సౌమిత్రి.

నాస్టోరీ బ్రీఫ్‌గా చెప్పేశాను. సౌమిత్రి అయ్యో పాపమని నా పరిస్థితికి జాలిపడలేదు.

'ఐయామ్ సో సారీ డియర్! నిన్ను చూస్తుంటే రిటైరైన వాడిలా లేవు. యంగ్ అండ్ హేడ్సమ్ హీరోలానే అవుపిస్తున్నావ్ నాకళ్లకు...'

'రియల్లీ!?- నువ్వూ దేవకన్యలాగే వున్నావ్ ఇప్పటికీ...' గోల్డెన్‌డేస్‌ను గుర్తు చేసుకుంటూ నాలో నేను మురిసాను.

'సో... యు వాంట్ బి హియర్... ఇన్ దిస్ ఓల్డేజ్ హోమ్...'

అందుకే వచ్చానన్నట్టు తలపంకించాను.!

'నో! ఆశ్రమంలో వుండటానికి అనుమతించను...'

ఆ మాటకు బిత్తరపోయి బిక్క ముఖం వేశాను.

నన్ను పరికిస్తూ... లోతుగా ఆలోచిస్తూ 'ఇఫ్ యు డోన్ట్ మిస్టేక్ మి... నా ఆలోచనా నీకెలా అన్పిస్తుందో చెప్పు...'

సౌమిత్రి ముఖంలోకి... కళ్లల్లోకి తదేకంగా చూస్తూండిపోయాను.

'మనం ఒక నాటి ప్రేమికులం! అప్పట్లో ఏకం కాలేకపోయాం!- ఇన్నేళ్లకు తలవని తలంపుగా కల్సుకున్నాం! ఐయామ్ సో హేపీ!- మనిద్దరం నా బంగళాలో కలిసే వుందాం! ఈ 'హోం' బాధ్యతలు నీకు వప్పగిస్తాను. ఇక నుండి నువ్ చూచుకో!- జీవితంలో ఓడిపోయి విసిగిపోయిన నాకు ఇకనైనా మనశ్శాంతి నీ సహచర్యం వల్ల పొందగలిగితే నాకదే పదివేలు మై డియర్ హరినాథ్...'

సౌమిత్రి మాటలు వింటూ మూగవాడినయ్యానన్పించింది!!

(సమాప్తం)